క్లుప్తంగా

సాయిసుధ మందిరం వార్షికోత్సవం

గురజాల : పట్టణంలోని సాయి ప్రేమ సుధ మందిరం 17వ వార్షికోత్సవాలు మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగులతో విద్యుత్ దీపాలంకరణతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. వేకువ జాము నుంచి స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు పలు చర్యలు చేపట్టారు. స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శాంతి హోమాలు నిర్వహించారు. స్వామిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. మధ్యాహ్న సమయంలో ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ నిర్వహించారు. స్వామి అన్న ప్రసాద వితరణలో వేలాది మంది పాల్గొని ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు.

పైప్‌లైన్‌కు లీకులు



గురజాల : పట్టణంలోని పలు ప్రాంతాల్లో పైపుల నుంచి మంచినీరు లీకవుతోంది. గతంలో రోడ్డు విస్తరణ పనులు చేసే సమయంలో తీసిన గుంతల్లో పగిలిన పైపు లైన్లకు తూ..తూ మంత్రంగా మరమ్మతులు చేసి రహదారి నిర్మాణం చేపట్టారు. మోటారు వేసిన ప్రతిసారీ నీళ్ళు పైపుల లీకుల్లో నుంచి బయటకు వస్తున్నాయి. స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద మాచర్ల పోవు ఆర్అండ్‌బీ రోడ్డుపై పైప్‌లైన్ నుంచి ఉదయం, సాయంత్రం సరఫరా చేసే సమయంలో మంచినీరు పైకి ఉబికి వస్తున్నాయి. పలు చోట్ల పైపులు లీకవుతున్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపిస్తున్నారు. డ్రెయినేజీ ప్రాంతాల్లో పైప్‌లైన్ లీకులున్న చోట్ల మంచినీటిలో మురుగు నీరు కలిసి కలుషితమవుతోంది. ఈ నీరు కుళాయిల ద్వారా సరఫరా అవడం వల్ల వ్యాధులకు ప్రబలుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సస్య రక్షణతోనే అధిక దిగుబడులు



మంచికల్లు(రెంటచింతల): వరి సాగుచేస్తున్న రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారానే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి చెప్పారు. మంగళవారం మండలంలోని మంచికల్లు గ్రామంలో నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన రైతులకు వరి పంట సాగుపై మెలుకువలు వివరించారు. మాజీ సర్పంచ్ గోగుల పుల్లారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నవ సమాజ నిర్మాణం కోసం కృషి



దాచేపల్లి : విద్యార్థి దశ నుంచే నీతి నిజాయితీగా ఉంటూ నవసమాజ స్థాపన కోసం కృషి చేయాలని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ చీఫ్ విజిలెన్స్ అధికారి ఇ.రాంబాబు చెప్పారు. మండలంలోని ముత్యాలంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బ్యాంక్ ఆధ్వర్యంలో జాగరూకత అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మ్యూజిక్ షో ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో సత్యనిష్ట ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు విజయ్‌కుమార్, పర్ల శ్రీనివాస్, వివి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు



పిడుగురాళ్ల రూరల్: రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీ కృష్ణదేవరాయులు చెప్పారు. మండలంలోని కోనంకి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. పలు రకాల సేద్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో. ఏవో శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వనరుల కేంద్రం నర్సరావుపేట అధికారి పి.ప్రవీణ్, గ్రామ సెక్రటరీ గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

వాగులో కలిసిన వాగ్దానాలు

కలగానే హైలెవెల్ బ్రిడ్జి !

- వానాకాలంలో ప్రజలకు తప్పని ఇక్కట్లు
- పిల్లేరు వాగు ఉధృతికి ఏటా కష్టాలే
- పట్టించుకోని సర్కారు



చప్టా వద్ద వరదలో చిక్కుకున్న ఆటోను ట్రాక్టర్‌తో లాగుతున్న దృశ్యం(ఫైల్)



పిల్లేరు వాగుపై చప్టా



వాగులో చిక్కుకున్న లారీ

మాచవరం: మూడు దశాబ్దాలుగా పిల్లేరు వాగుపై హైలెవెల్ బ్రిడ్జి కలగానే మిగులుతోంది. ఏటా వానాకాలంలో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. వాగు ఉధృతంగా పొంగడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్కారు పట్టించుకోవడం లేదు. నేతలు చేస్తున్న వాగ్దానాలు వాగులోనే కలిసిపోతున్నాయి.

చప్టాపైనే ప్రమాదకరంగా రాకపోకలు

మాచవరం మండలంలోని శ్రీరుక్మిణీపురం శివారు గ్రామమైన నాగేశ్వరపురం తండా వద్ద పిల్లేరువాగు ఉంది. మూడు దశాబ్దాల క్రితం పిల్లుట్ల గ్రామం నుంచి బెల్లంకొండ మండలానికి వెళ్లేందుకు అనుకూలంగా లింకు రోడ్డు నిర్మించారు. అదే సమయంలో పిల్లేరువాగుపై చప్టా నిర్మించారు. అయితే వానాకాలంలో ఈ చప్టాపై నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఒక్కోసారి ప్రమాదకరంగా మారుతోంది. ఇక్కడ హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.

ఇవిగో ప్రమాదాలు..

- నాలుగేళ్ల క్రితం ఇసుక లోడుతో వస్తున్న లారీ వాగులో కొట్టుకుపోయింది. డ్రైవర్ ప్రమాదం నుంచి బయట పడ్డాడు.
- ఆ తర్వాత ఏడాది జీవాలు వరద ఉధృతిలో కొట్టుకుపోయి మృత్యువాత పడ్డాయి.
- ఈ ఏడాది వరద నీటి ఉధృతికి ఆటో కొట్టుకుపోతుండడంతో ట్రాక్టర్ సాయంతో బయటకు తీశారు.
- చప్టాపై పసర పట్టంతో ద్విచక్ర వాహనాలు జారి వాగులో పడిపోతున్నాయి.

ప్రతిపాదనలు పంపినా..!

ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రాకపోలు సాగించేందుకు హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపడతామని సుమారు 8 ఏళ్ల క్రితం దాదాపు రూ.5 కోట్లతో అధికారులు ప్రతిప్రాదనలు పంపారు. రెండేళ్లలో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామని అప్పటి పాలకులు హామీ ఇచ్చారు. అయినా పట్టించుకోకపోవడంతో ప్రతిపాదన మరుగున పడిపోయింది. ఇప్పటికైనా పిల్లేరు వాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి కష్టాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

వంతెన కట్టి పుణ్యం కట్టుకోండి



వర్షాకాలంలో పిల్లేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వానాకాలంలో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రాణాలరచేతపట్టుకుని ప్రయాణాలు సాగిస్తున్నాం. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించడం లేదు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే వంతెన కట్టి పుణ్యం కట్టుకోండి.

– బాబూరావు నాయక్, నాగేశ్వరపురం తండా

భయంగా ఉంటుంది.



వర్షాకాలంలో పొలాలకు వెళ్లాలంటే భయంగా ఉంటుంది. ఎన్నో ఏళ్ల క్రితం పిల్లేరుపై చప్టా నిర్మించారు. వర్షాకాలంలో ఎగువ నుంచి ఉధృతంగా వరదనీరు వస్తోంది. పిల్లేరు అవతల వైపు ఉన్న పొలాలకు వెళ్లాంటే భయంగా ఉంటుంది. అధికారులు స్పందించాలి.

– శ్రీను నాయక్, నాగేశ్వరపురం తండా

బ్రిడ్జి నిర్మించండి



పిల్లేరుపై చప్టా లోలెవెల్లో ఉండడంతో వరదలు వచ్చినప్పుడు పలు గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పలు మార్లు ప్రమాదాలు జరిగాయి. ప్రాణనష్టం జరిగింది. వరద ఉధృతికి మూగజీవాలు, పశువులు కొట్టుకుపోతున్నాయి. బ్రిడ్జి నిర్మిస్తే కష్టాలు తీరతాయి.

– శ్రీశైలం నాయక్, నాగేశ్వరపురం తండా

బాణసంచా పట్టివేత

మాచవరం: అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను పట్టుకున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. వివరాల ప్రకారం మాచవరం గ్రామానికి చెందిన కాకరపర్తి రామకృష్ణ ఇంట్లో దీపావళి మందులు అనుమతులు లేకుండా నిల్వ ఉంచారనే విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం దాడులు నిర్వహించగా, అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



దాచేపల్లి : పంటల సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని ఏవో డి. పాపకుమారి అన్నారు. మండలంలోని భట్రుపాలెం, కాట్రపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు సాగు చేస్తున్న పత్తి, మిర ప, వరి పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. తగిన మోతాదులో మాత్రమే ఎరువులను వాడాలని, అధిక ఎరువుల వాడకం వలన దిగుబడులు తగ్గుతాయని ఆమె చెప్పారు. ప్రకృతి వ్యవసాయం చేసేందుకు రైతులు ఆసక్తి చూపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కొండనాయక్, శ్రీనివాసరాజు, ఎంపీటీసీ రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సింగరయ్యకు మాజీ ఎమ్మెల్యే కాసు పరామర్శ



సింగరయ్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు, తదితరులు

మాచవరం: వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్యను గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. మే నెల 15న రాత్రి సమయంలో టీడీపీ శ్రేణులు దారికాచి సింగరయ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు దారం లచ్చిరెడ్డిపై దాడి చేశారు. ఘటనలో సింగరయ్యకు కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స అనంతరం గ్రామానికి వచ్చిన సింగరయ్యను ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జడ్పీటీసీ శివాయాదవ్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి జిలుగు నరసింహారెడ్డి, మండల నాయకులు దారం లచ్చిరెడ్డి, మద్దు ప్రసాదు, అనిల్‌కుమార్, ఎంపీటీసీలు, పలువురు సర్పంచులు, నాయకులు ఉన్నారు.

పక్షి స్థావరాలు ఏర్పాటుతో ఎంతో మేలు



మాచవరంలో పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

మాచవరం: పత్తిలో గులాబీ రంగు పురుగును అరికట్టేందుకు ఎకరాకు 6 నుంచి 8 పక్షి స్థావరాలు ఏర్పాటు చేసుకోవడం వలన ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఏఓ కె.రామమ్మ తెలిపారు. మాచవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎకరాకు 8 లింగార్షక బుట్టలు ఏర్పాటు చేసుకొని పురుగు ఉధృతిని బట్టి యాజమాన్య పద్ధతులను పాటించాలని తెలిపారు. రైతులకు సాగు యాజమాన్యం, ఎరువులు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాధికారి కరుణకుమారి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాస్‌రెడ్డి

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని ఎరువులు, పురుగు మందల దుకాణంలో ఏఓ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎరువులు, పురుగు మందులను విక్రయించే వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తే సహించేది లేదన్నారు. అంతేకాకుండా ఎరువులు, పురుగు మందులు కొనేటప్పుడు తప్పనిసరిగా రసీదులను పొందాలన్నారు. వాటిని భద్రపరుచుకోవటం వలన ఎంతో మేలు జరుగుతుందని ఆయన తెలియజేశారు. వ్యాపారస్తులు ఎరువులు, పురుగు మందుల స్టాక్ రిజిస్టర్‌ను తప్పనిసరిగా మెయింటినెన్స్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం దేశానికి ఆదర్శనీయం



మాచర్లలో అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

మాచర్ల/పిడుగురాళ్ల/ రెంటచింతల: విద్యావేత్త, శాస్త్రవేత్త, రాష్ట్రపతిగా, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి ఆదర్శనీయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం అబ్దుల్‌కలాం జయంతి కార్యక్రమం కలాం సేవాసమితి అధ్యక్షుడు పాషావలి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. విగ్రహ దాత గోలి శ్రీనివాసరావు, నాయకులు వై.కేవశరెడ్డి, కె.అనిల్, కె.చంటి, మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

- అబ్దుల్ కలాం ఆశయ సాధన కోసం ముందుకు సాగాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పిడుగురాళ్ల పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- దేశకీర్తి ప్రతిష్టలను ప్రపంచ నలుమూలల చాటిన మహోన్నత వ్యక్తి భారతరత్న మాజీ రాష్ట్రపతి ఏపిజే అబ్దుల్ కలామ్ అని స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. మోహన్, కన్నెగంటి హనుమంతు పౌండేషన్ అధ్యక్షులు నారాయణపురం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పాఠశాలలో అబ్దుల్ కలాం జయంత్యుత్సవం జరిగింది. కార్యక్రమంలలో ఉపాధ్యాయులు జి.లింగయ్య, ఎం. శ్రీనివాసులు, యు. ఉషారాణి, డి. వెంకటలక్ష్మి, జే. జనార్దన్‌రావు, ఎ. వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

18న మాచర్లలో జాబ్ మేళా

మాచర్ల : మాచర్ల పట్టణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 18 ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తంబాజీరావు మంగళవారం తెలిపారు. 18 నుంచి 30 ఏళ్లలోపు యువత జాబ్‌మేళాలకు హాజరు కావాలన్నారు. కార్యక్రమాన్ని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. యాక్సెస్ బ్యాంకు, జయలక్ష్మి ఆటోమొబైల్, రిలయన్స్ రిటైల్ సంస్థల ప్రతినిధులు జాబ్‌మేళాలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లమా చేసిన నిరుద్యోగులు, యువత హాజరు కావచ్చన్నారు. దరఖాస్తుతోపాటు, పాస్‌పోర్టు ఫొటోలు, జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 7842747682 నంబరులో సంప్రదించాలన్నారు.

రెండువేల మందికి అన్నదానం



మాచర్ల : స్థానిక పత్తి ఫ్యాక్టరీలోని శ్రీసాయిబాబా ఆలయ ప్రాంగణంలో లలితాంబకు దసరా ఉత్సవాల సందర్భంగా అర్చకులు మారుతీ, దేవాదాయశాఖ అభివృద్ధి కమిటీ చైర్మన్ కె.వీరాంజనేయులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పూజలు చేశారు. దసరా ముగింపు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 2 వేల మందికి అన్నదానం నిర్వహించారు. భక్తులు లలితాంబను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలు స్వీకరించి, అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన



మాచవరం: పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని రేగులగడ్డ, చెన్నాయపాలెం, వేమరవం గ్రామాల్లో సీసీ రోడ్లకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఒక్కో గ్రామానికి రూ.15 లక్షలు నిధులు మంజూరైనట్లు ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ వెంకటేశ్వర్లు , ఈఓపీఆర్డీ వెంగళరావు. ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, పెద్దలు పాల్గొన్నారు.

రోడ్లకు శంకుస్థాపనలు



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



మిట్టగుడిపాడులో భూమిపూజ చేస్తున్న దృశ్యం

మాచర్ల రూరల్/రెంటచింతల/: వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. మంగళవారం బైరవునిపాడు, జమ్మలమడక గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రోడ్ల శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 117.75 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ వీరాస్వామి, కె.కోటేశ్వరరావు, జి.శ్రీను, గోపిరెడ్డి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

– మండలంలోని మిట్టగుడిపాడు, గోలి గ్రామాలలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన పనులకు మంగళవారం భూమి పూజ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ కె. సరోజినిదేవి, సర్పంచ్‌లు గొట్టం ప్రమీల గురవారెడ్డి, మున్నా చంద్రం, పీఆర్ఏఈ వెంకటేశ్వరరెడ్డి, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు చపారపు అబ్బిరెడ్డి, మాజీ సర్పంచ్ గొట్టం సుబ్బారెడ్డి, ఏపీఓ జి.జయ చంద్రకుమార్, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు యూనిఫాం పంపిణీ



యూనిఫాం పంపిణీ చేస్తున్న దృశ్యం

వినుకొండ(నూజెండ్ల): రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ చేతుల మీదుగా 200 మంది కార్మికులకు ఈ యూనిఫాంను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ సభ్యులు సమాజ అభివృద్ధి కోసం వారు చేస్తున్న స్వచ్ఛంద కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ జి. శ్రీకాంత్‌రెడ్డి, సెక్రటరీ ఏరువ వెంకటనారాయణ, ట్రెజరర్ ఎస్‌కే ముస్తాన్, మాజీ ప్రెసిడెంట్లు ముత్తినేని గిరిబాబు, చిరుమామిళ్ల కోటేశ్వరరావు, అలా శ్రీనివాసరావు, బత్తుల శ్రీనివాసరావు, సాధినేని శ్రీనివాసరావు, జి. నాగరాజు, పెనుగొండ రాజేష్, మాదాల హనుమంతరావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మిరప రైతులు.. జాగ్రత్తలు తీసుకోండి



వినుకొండ(నూజెండ్ల): ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలకు మిరప పంటలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వినుకొండ ఉద్యాన అధికారి షేక్ నబీ రసూల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరకెత్తిన పొలాల్లో మొక్కలు వెంటనే తేరుకోవడానికి లీటరు నీటికి 10 గ్రాముల యూరియా మరియు 10 గ్రాముల పంచదార కలిపిన ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలన్నారు. మొక్కలు వడబడి, తలలు వాల్చినట్లయితే లీటరు నీటికి 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. ఇనుపధాతు లోపంతో మొక్కలు పాలిపోయినట్లు కనబడితే పది లీటర్ల నీటికి 50 గ్రాముల అన్నభేదితో పాటు ఒక నిమ్మ చెక్కరసం కలిపి పిచికారి చేయాలని తెలిపారు. కాపుతో ఉండి వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదుళ్ల చుట్టూ మట్టిని ఎగదోయాలన్నారు. నేల అదునుకు వచ్చిన వెంటనే గొర్రు వేసి అంతర కృషి చేసినట్లయితే వెంటనే ఆరుతుందని వివరించారు. పైపాటుగా ఎకరానికి అదనంగా 30 కిలోల యూరియా 15 కిలోల పొటాష్, 200 కిలోల వేప పిండి వేయాలన్నారు. బ్యాక్టీరియా, ఆకుమచ్చ, కోనోఫోర తెగుళ్లు, వేరుకుళ్లు, కాయకుళ్లు, కొమ్మ ఎండు తెగుళ్ల నివారణకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు.

పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచండి

బొల్లాపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం బొల్లాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.శంకరనారాయణ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఎస్సీ కాలనీలో జ్వరాలు, వాంతులు, విరేచనాలు వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందించారు. వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమ తెరలు వాడాలని సూచించారు. వర్షాలు కురవడం వల్ల మురుగు చేరి దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పారిశుధ్యం మెరుగుపరచాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు.

ఎండు తెగులుకు కాంటాప్ పిచికారి చేయండి

రొంపిచర్ల: మండలంలోని అన్నవరం, తుంగపాడు గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరిపైరులో ఎండు తెగులు ఆశిస్తుందని, కాంటాప్ మందును పిచికారి చేయాలని ఏడీఏ మస్తానమ్మ సూచించారు. ఈ పైరుకు పైపాటుగా పొటాష్ ఎరువును వాడి మొక్కల్లో రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలన్నారు.